సాక్షి

# ఎయిర్‌పోర్టు మెట్రో బరిలో.. ఎల్‌అండ్‌టీ, ఎన్‌సీసీ

- రూ.5,688 కోట్లతో బిడ్డింగ్
- త్వరలో ప్రభుత్వానికి నివేదిక: ఎన్వీఎస్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఎయిర్‌పోర్టు మెట్రో ప్రాజెక్టు నిర్మాణానికి రెండు అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు పోటీలో నిలిచాయి. రూ.5,688 కోట్లతో ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు ఎల్‌అండ్‌టీ లిమిటెడ్, ఎన్‌సీసీ లిమిటెడ్ (గతంలో నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ)లు పోటీలో ఉన్నట్లు హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ఈ ప్రాజెక్టును దక్కించుకొనేందుకు బిడ్డింగ్ దాఖలు చేయగా, చివరకు ఈ రెండు సంస్థలు పోటీలో నిలిచాయని పేర్కొన్నారు. రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు సుమారు 31 కిలోమీటర్ల ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ కోసం ఈపీసీ (ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్) పద్ధతిలో హెచ్‌ఏఎంఎల్ గ్లోబల్ టెండర్లను ఆహ్వానించిన సంగతి తెలిసిందే. ఈనెల 5వ తేదీనే బిడ్డింగ్ గడువు ముగిసినప్పటికీ కొన్ని సంస్థల విజ్ఞప్తి మేరకు 12వ తేదీ బుధవారం వరకు గడువు పొడిగించారు. గురువారం బేగంపేట్‌లోని మెట్రో భవన్‌లో టెండర్లను ఓపెన్ చేశారు. ఇప్పటికే హైదరాబాద్‌తో పాటు పలు నగరాల్లో మెట్రో నిర్మాణం చేపట్టిన అనుభవం ఉన్న ఎల్‌అండ్‌టీ సంస్థతో పాటు ఎన్‌సీసీ కూడా ఈ బిడ్డింగ్ పోటీలో నిలిచాయి.ఈ రెండు సంస్థలు తమ అనుభవాలు, సాంకేతిక, ఆర్థిక సామర్థ్యాలు, తదితర అంశాలపై డాక్యుమెంట్లను సమర్పించినట్లు ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. అలాగే రూ.29 కోట్ల చొప్పున బ్యాంక్ గ్యారంటీ సెక్యూరిటీ డిపాజిట్ చేశాయి. 10 రోజుల్లో పోటీలో ఉన్న రెండు సంస్థలపైన సమగ్రమైన నివేదికలను రూపొందించి ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు ఎన్వీఎస్ రెడ్డి స్పష్టం చేశారు. వచ్చే రెండున్నరేళ్లలో మెట్రో రైల్ ప్రాజెక్టును పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

Date: 14/07/2023, Edition: Hyderabad (Hyderabad), Page: 18
Source : https://epaper.sakshi.com/